క్లుప్తంగా

దళిత ఉద్యమ సమీక్షకు హాజరు కావాలి



మాట్లాడుతున్న దారా అంజయ్య

తాళ్లూరు: బాపట్ల జిల్లా కారంచేడులో దళితులపై 40 ఏళ్ల క్రితం జరిగిన మారణకాండపై చీరాలలో గురువారం జరగనున్న దళిత ఉద్యమ సమీక్షకు ప్రతి దళితుడు హాజరై విజయవంతం చేయాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దారా అంజయ్య కోరారు. మండల కేంద్రం తాళ్లూరు అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్లో బుధవారం ఆయన మాట్లాడారు. దళిత హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు ఆధ్వర్యంలో చీరాలలో జరగనున్న సమీక్షకు దళితులు తరలి రావాలని అంజయ్య కోరారు.

ఓటర్ల జాబితా పారదర్శకంగా ఉండాలి



శిక్షణకు హాజరైన బూత్ లెవల్ అధికారులు

దర్శి: ఓటర్ల జాబితా పారదర్శకంగా ఉండాలని దర్శి ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎస్.జాన్సన్ అన్నారు. పట్టణంలోని సబ్ ట్రెజరీ కార్యాలయంలో బుధవారం పోలింగ్ బూత్ అధికారులకు ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా ట్రైనింగ్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా జాన్సన్ మాట్లాడుతూ బూత్ లెవల్ అధికారులు ఓటర్ లిస్ట్ స్వచ్ఛీకరణ విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. అర్హులకు నూతన ఓటు కల్పించాలని, చనిపోయిన ఓటర్ మరణ ధ్రువీకరణ పత్రం తీసుకొని వెంటనే వారి ఓటు తొలగించాలని సూచించారు. తహసీల్దార్ ఎం.శ్రావణ్‌కుమార్ బూత్ లెవల్ అధికారులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ టి.దేవప్రసాద్, మాస్టర్ ట్రైనీ రవిచంద్ర, కంప్యూటర్ ఆపరేటర్ ఆఫ్రోజ్ పాల్గొన్నారు.

అడిగినోళ్లకు పని కల్పించాలి

● డీడీవో బాలునాయక్



ఎస్‌డబ్ల్యూపీసీని తనిఖీ చేస్తున్న డీడీవో బాలునాయక్

పుల్లలచెరువు: గ్రామాల్లో అడిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించాల్సిన బాధ్యత ఉపాధి సిబ్బందిపై ఉందని మార్కాపురం డివిజన్ అభివృద్ధి అధికారి బాలు నాయక్ సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సచివాలయం, ఉపాధి హామీ సిబ్బందితో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పథకం ఉద్దేశం నెరవేరడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధి పనులు మండలంలోని పలు గ్రామాల్లో సక్రమంగా జరగడం లేదని, అందుకే వలసలు ఎక్కువగా ఉంటున్నాయని చెప్పారు. ఉపాధి హామీ పథకంలో ప్రతి కుటుంబానికి 100 రోజుల పని కల్పించాల్సి ఉన్నా సిబ్బంది నిర్లక్ష్యంతో అలా జరగడం లేదని, పని దినాలు మెరుగు పర్చాల్సి ఉందని సిబ్బందిని హెచ్చరించారు. తాను వచ్చే వారం మళ్లీ తనిఖీకి వస్తానని, సిబ్బందిలో మార్పు రాకుంటే కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ప్రజలకు జవాబుదారీగా విధులు నిర్వహించాలన్నారు. విధుల పట్ల అశ్రద్ధ చేయవద్దని, సచివాలయాలకు వచ్చే ప్రజలకు నిర్లక్ష్యంగా జవాబు చెప్పవద్దని సూచించారు. రికార్డులు సక్రమంగా నిర్వహించడంతో పాటు సమయపాలన పాటిస్తూ జవాబుదారీగా పనిచేయాలని చెప్పారు. కార్యదర్శులు కూడా అప్రమత్తంగా ఉండి సచివాలయం, ఉపాధి హామీ పనులపై పర్యవేక్షణ నిర్వహించాలన్నారు. అనంతరం పుల్లలచెరువు సచివాలయాన్ని తనిఖీ చేశారు. అక్కడి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పుల్లలచెరువులో ఉన్న చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించి గ్రామాల్లో పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించాలని, చెత్త నుంచి సంపదను తయారు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో మరియదాసు పాల్గొన్నారు.

పోక్సో చట్టాలపై అవగాహన ఉండాలి



సదస్సులో మాట్లాడుతున్న ఎస్సై చౌడయ్య

యర్రగొండపాలెం: పోక్సో చట్టం, సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్సై పి.చౌడయ్య, ఎంఈవో పి.ఆంజనేయులు అన్నారు. బుధవారం స్థానిక విద్యావనరుల కార్యాలయంలో హెడ్మాస్టర్లకు జరిగిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. ఆ చట్టాలపై హెచ్ఎంలు తమ పరిధిలో ఉన్న ఉపాధ్యాయులకు అవగాహన పరిచి వారి ద్వారా విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. పిల్లలను లైంగిక నేరాల నుంచి తప్పించటానికి, కాపాడటానికి పోక్సో చట్టం ఉందన్న విషయం ప్రతి ఒక్కరికీ తెలిసే విధంగా ఉపాధ్యాయులు చూడాలన్నారు. పోక్సో లైంగిక నేరాల నుంచి రక్షించేందుకు ప్రత్యేక చట్టమని, అశ్లీల చిత్రాల నుంచి వారిని రక్షించేందుకు ప్రత్యేక కోర్టులు ఉన్నాయని, ఈ చట్టం పగడ్బందీగా అమలయ్యే విధంగా మహిళా శిశు సంరక్షణ శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రస్తుత కాలంలో కంప్యూటర్ ఆధునిక సాంకేతికతతో సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడుతున్నారని, వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని ఎస్‌బీఐ మేనేజర్ నాగేంద్ర అన్నారు. వివిధ లింకులు ఫోన్ల ద్వారా పంపించి సంబంధించిన ఓటీపీల ద్వారా తమ ఖాతాల నుంచి డబ్బులు కొట్టేస్తున్నారని, బ్యాంకులు ఎటువంటి ఓటీపీలు అడగవని, సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండే విధంగా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం సమగ్ర శిక్ష నుంచి మంజూరైన 4 వీల్ చైర్స్‌ను దివ్యాంగులకు పంపిణీ చేశారు. సదస్సులో ఎంఈవో–2 మల్లూ నాయక్, సీఆర్ఎంటీలు సాధిక్, చెన్నకేశవులు, సురేష్ పాల్గొన్నారు.

పంటలకు క్రాప్ ఇన్సూరెన్స్ చేసుకోవాలి



ఇన్సూరెన్స్‌పై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ



పత్తి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

దొనకొండ: గ్రామాల్లోని రైతులు పంటలకు గ్రామ వ్యవసాయ సహాయకుల నుంచి సర్టిఫికెట్ తీసుకోవాలని వ్యవసాయాధికారి వి.బాలకృష్ణనాయక్ సూచించారు. మండలంలోని కొచ్చెర్లకోట, సిద్ధాయపాలెం రైతులకు క్రాప్ ఇన్సూరెన్స్‌పై బుధవారం అవగాహన కల్పించారు. కంది పంటకు రూ.430, మిరప రూ.4500 ఇన్సూరెన్స్ ఈ నెల 31వ తేదీలోపు కట్టుకోవాలని తెలిపారు. కంది సాగు చేసిన రైతులకు వ్యవసాయ కేంద్రాల్లో కందులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. కౌలు రైతులు వీఆర్ఓల నుంచి కౌలు కార్డులు పొందాలని ఏఓ తెలిపారు. ఆయన వెంట గ్రామ రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

యర్రగొండపాలెం: రైతులు తమ పంటలను తప్పనిసరిగా ఈ–పంట నమోదు చేసుకోవాలని వ్యవసాయ సహాయ సంచాలకులు ఈ.వెంకట రమణ కోరారు. బుధవారం మండలంలోని గంజివారిపల్లె, వెంకటాద్రిపాలెం గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ–పంట నమోదు చేసుకున్న రైతులు ప్రభుత్వ పథకాలు పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. కంది, మొక్కజొన్న, పత్తి పంటల్లో యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలన్నారు. అనంతరం పాలుట్ల గిరిజన గూడేనికి చెందిన దేశావత్ గణపతి నాయక్ రైతు మిత్ర గ్రూపుకు ప్రభుత్వం 90 శాతం సబ్సిడీపై అందించిన వ్యవసాయ డ్రోన్‌ను పంపిణీ చేశారు. ఏవో కె.నీరజ, ఏఈవో డి.ధనేశ్వర్ నాయక్ పాల్గొన్నారు.

గ్రేస్ పాస్టర్స్ నూతన కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులు

దర్శి: దర్శి రీజియన్ గ్రేస్ పాస్టర్స్ డవలప్‌మెంట్ అసోసియేషన్ (రిజిస్ట్రేషన్ 302/2015) నూతన కమిటీ ఎన్నిక స్థానిక సీయోను ప్రార్థన మందిరంలో గుంటూరు కృపానందం అధ్యక్షతన బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దర్శి రీజియన్ అధ్యక్షుడిగా గొంగటి జాన్, వైస్ ప్రెసిడెంట్‌గా దారా నాగేశ్వరరావు, సెక్రటరీగా మేకా లూకా బాబు, ట్రెజరర్‌గా గంథం ఏసుదాస్, రికార్డ్ సెక్రటరీగా గొల్లపాటి థామస్, గౌరవ అధ్యక్షులుగా గుంటూరు కృపానందం, తాతపూడి ఇమ్మానియేల్, కావూరి భూషణ్‌రావు, కొలకలూరి పౌల్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నగరికంటి ఏసన్న కార్యవర్గ సభ్యులుగా మల్లెల జాషువా, గుడిమెట్ల నిమ్మేష్, మురికిపూడి నాసరయ్య, గర్నెపూడి దావీదు, ఏల్చూరి ఏలియాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వారిని ఘనంగా సత్కరించారు.

సీపీఐ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలి



వాకర్స్‌తో కలిసి కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

దర్శి: సీపీఐ 28వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆర్.కరుణానిధి కోరారు. రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ఆ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను బుధవారం స్థానిక వాకర్స్‌కు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కరుణానిధి మాట్లాడుతూ ఆగస్టు 20 నుంచి 25వ తేదీ వరకు ఒంగోలులో సీపీఐ రాష్ట్ర మహాసభలు జరుగుతున్నాయన్నారు. 20వ తేదీ నుంచి ప్రజా కళారూపాలు ప్రారంభమవుతాయని, 23వ తేదీన శ్రమజీవుల శంఖారావం, ప్రజా ప్రదర్శన, బహిరంగ సభ ఉంటుందని పేర్కొన్నారు. సభకు సీపీఐ జాతీయ కార్యదర్శి డి.రాజా, కె. నారాయణ, కేంద్ర, రాష్ట్ర నాయకులు, సినీ కళాకారులు పాల్గొంటారన్నారు. ఆగస్టు 23వ తేదీన ఒంగోలులో జరిగే ప్రజా ప్రదర్శనకు ప్రతి ఒక్కరూ కదిలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు కె.హనుమంతరావు, జూపల్లి కోటేశ్వరరావు, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రామాంజియాదవ్, సింగరకొండ శ్రీను, కల్లూరి పెద్ద ఆంజనేయులు, విజయ్ పాల్గొన్నారు.



ఉద్యానవన పంటల సాగుతో ఆర్థికాభివృద్ధి

బేస్తవారిపేట: రైతులు జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో ఉద్యానవన పంటలు సాగు చేసుకోవాలని ఎంపీడీఓ ఏవీ రంగనాయకులు అన్నారు. మండలంలోని పెద్ద ఓబినేనిపల్లెలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్‌లో నాటుకున్న హార్టీకల్చర్ బుధవారం పంటలను పరిశీలించారు. పూలు, పండ్ల మొక్కల తోటలను నాటుకోవడంతో ప్రతి సంవత్సరం దిగుబడి పొందుతూ ఆర్థికాభివృద్ధి చెందవచ్చన్నారు. ఉత్సాహం ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ కే గురువరకుమార్, టీఏ సీహెచ్ ఎం బాలలింగయ్య, ఎఫ్ఏ పాల్గొన్నారు.

రేపు బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కురిచేడు: దర్శిలోని పాదిలి రోడ్ బీవీఎస్ఆర్ నిలయంలో శుక్రవారం బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యన్నాబత్తుల వెంకట సుబ్బయ్య తెలిపారు. బుధవారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో సుబ్బయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంవత్సరం పాలనలో ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకపోవడంతో ప్రజలు, విద్యార్థులు, మహిళలు, రైతులు, నిరుద్యోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ బాబు ష్యూరిటీ మోసం..గ్యారంటీ కార్యక్రమం నియోజకవర్గ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, రాష్ట్ర మహిళా నాయకురాలు శ్యామల హాజరవుతారని చెప్పారు. మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు వైఎస్సార్ సీపీ మండల కమిటీ సభ్యులు, అనుబంధ విభాగాల నాయకులు, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు విరివిగా హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర ట్రేడ్ యూనియన్ కార్యదర్శి షేక్ సైదా, జిల్లా అధికార ప్రతినిధి గోగులమూడి లింగారెడ్డి, నియోజకవర్గ పంచాయతీ రాజ్ వింగ్ అధ్యక్షుడు మేరువ సుబ్బారెడ్డి, వాణిజ్య విభాగం అధ్యక్షుడు పెండేల సాంబశివరావు, బీసీ సెల్ అధ్యక్షుడు నిమ్మకాయల రాజయ్య, మండల పార్టీ ఉపాధ్యక్షుడు ఊట్ల వెంకటేశ్వర్లు, పోతిరెడ్డి నాగిరెడ్డి, ప్రధాన కార్యదర్శి సారెడ్డి నాగిరెడ్డి, పంచాయతీ రాజ్ వింగ్ మండల అధ్యక్షుడు గొట్టిపాటి రాములు, మండల వాణిజ్య విభాగం అధ్యక్షుడు కొత్తమాసు సుబ్రహ్మణ్యం, కార్యవర్గ సభ్యులు కొలూరి నర్సింహులు, గండి గంగయ్య, సోషల్ మీడియా కన్వీనర్ కోలా సంతోష్‌కుమార్, సీనియర్ నాయకుడు నుసుం ప్రతాప్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నాగిరెడ్డి పాల్గొన్నారు .

మధ్యవర్తిత్వంతో కేసులు పరిష్కరించుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు

దర్శి: మధ్యవర్తిత్వంతో కేసులు సత్వరమే పరిష్కరించుకోవాలని న్యాయవాదులు ఆదినారాయణ, మనోహరమ్మ, సుబ్బారెడ్డి పేర్కొన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఆదేశాల మేరకు మధ్యవర్తిత్వం వారోత్సవాల్లో భాగంగా గడియారం స్తంభం సెంటర్‌లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకుని మధ్యవర్తిత్వం ద్వారా కేసులు పరిష్కారం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు, విద్యార్థులు పాల్గొన్నారు.